క్లుప్తంగా

ఎస్ఐకి సన్మానం


ఎస్ఐని సన్మానిస్తున్న ప్రభుదాసు

దొనకొండ: నూతన ఎస్ఐ టి.త్యాగరాజును ప్రభు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఆదిమూలపు ప్రభుదాసు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎస్ఐకి ప్రభుదాసు తెలిపారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి



ఎస్సైను వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎస్పీ

తాళ్లూరు: మండలంలో పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లోని పలు రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో నిర్లక్ష్యం వహించరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని లా అండ్ ఆర్డర్ నేర నియంత్రణ వ్యూహాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై మల్లికార్జున, ఏఎస్ఐ మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.


పెద్దారవీడులో మిర్చి కోస్తున్న కూలీలు


సిద్ధినాయునిపల్లిలో పొగాకు ఆకులు కుడుతున్న కూలీలు

వ్యవసాయంలో రైతుల దిగాలు

- పెరుగుతున్న అదనపు ఖర్చులు
- పంటల కోతలకు కూలీల కొరత

పెద్దారవీడు: కొండంత ఆశతో పంటలు సాగు చేస్తున్న రైతులకు కూలీల కొరతతో నిత్యం తిప్పలు తప్పడం లేదు. దుక్కి దున్ని, విత్తనాలు నాటి, అవి పెద్దవై పంట దశకు చేరే వరకు చేసిన శ్రమ ఒక ఎత్తయితే పంట చేతికి రావడం మరో ఎత్తుగా మారింది. స్థానికంగా కూలీలు అందుబాటులో లేకపోవడంతో పంట కోత దశలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్, రబీలో సాగు చేసిన పంటలకు ఒకే సారి కోతలు రావడంతో కూలీల కొరత వేధిస్తోంది. వ్యవసాయంలో కూలీల పాత్ర చాలా కీలకంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న రంగం వ్యవసాయం. రైతులకు వ్యవసాయ పనుల్లో తోడుగా నిలుస్తోంది కూలీలు మాత్రమే. అలాంటి కూలీలు లేని వ్యవసాయం ఊహించడం కష్టమే. మిర్చి, పొగాకు, పత్తి, మినుము, బొబ్బర్లు తదితర పంటల కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీల లభ్యత తక్కువగా ఉండటంతో కోతలు ఆలస్యంగా అవుతున్నాయి. పంటలన్నీ ఒకే సమయంలో కోతలకు రావడంతో కూలీలకు మంచి గిరాకీ ఏర్పడింది. మిర్చి కోతలు, గ్రేడింగ్, పొగాకు కూర్చి ఎండబెట్టడం, మినుము, బొబ్బర్లు తొలగించడం తదితర ఎన్నో పనులకు కూలీలు అవసరం. సీజన్‌లో కూలీల కోసం రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో దూరం ఆధారంగా ఆటో చార్జీతో కలిపి మిర్చి కోతలకు రోజుకు రూ.500, పొగాకు మగ కూలీ రూ.1000, ఆడవారి కూలీ రూ. 600 రైతులు చెల్లిస్తున్నారు. క్వింటా మిర్చి కోసేందుకే తేజ వంటి రకాలైతే రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చు వస్తుంది. చిన్న, సన్నకారు రైతులు ఇతర గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఆటోల్లో రోజు వారీగా కూలీలను తీసుకొచ్చి మిర్చి కోయిస్తున్నారు. అందుకు కూలి డబ్బులతో పాటు ఆటో చార్జీలు అదనంగా భరించాల్సి వస్తుంది. దీంతో పెట్టుబడి ఈ అదనపు ఖర్చులు పోను కనీసం తమ కష్టానికి కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని పలువురు అన్నదాతలు వాపోతున్నారు. ఎకరా మిర్చికి పెట్టుబడి రూ.1.50 లక్షల వరకు అవుతుంది. మార్కెట్లో తగ్గుతున్న ధరల దృష్ట్యా తాజాగా మిర్చి పంట సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరం గడిస్తే పొలం పనులు చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవాలంటే ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని రైతులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా ప్రభుత్వాలు పెడ చెవిన పెడుతున్నాయి.


మద్దలకట్టలో మిర్చి గ్రేడ్ చేస్తున్న కూలీలు

కూలీలు దొరకడం లేదు:



మిర్చి రెండెకరాల్లో సాగు చేశా. మిర్చిని తక్కువ ధరకు వ్యాపారులు అడుగుతున్నారు. పంటలన్నీ ఒకేసారి కోతలకు రావడంతో కూలీల రేట్లు బాగా పెరిగాయి. కూలీల కొరతతో ఎక్కువ రేటుతో రోజుకు రూ.500 చెల్లించి మిర్చి గ్రేడ్ చేయిస్తున్నా. పొలం పనులు చేసే మహిళా కూలీలు మరికొంత కాలానికి కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. యంత్రాలు చేయలేని ఎన్నో పనులకు కూలీలు అవసరం. కూలీలు లేకుంటే వ్యవసాయం చేయలేం. ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయం అనుసంధానం చేయడం ఒక్కటే పరిష్కార మార్గం.

– ఒంటేరు పెద్దకొండయ్య, మద్దలకట్ట

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

దొనకొండ: రైతులు పండించిన మిర్చి, కంది పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాచరణ కార్యదర్శి బత్తుల వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. రూ.వేలకు, వేలు ఖర్చు చేసి మిర్చి సాగు చేశారని, కూలి రేట్లు విపరీతంగా పెరిగాయని, గుంటూరు మార్కెట్ యార్డులో పూర్తిగా ధర పడిపోయిందని, గత నాలుగేళ్లలో మిర్చి ధర కనిష్ఠ రూ.18 వేలు, గరిష్ఠ రూ.22 వేలు గుంటూరులో పలికిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

దొనకొండ ప్రాంతం మెట్ట ప్రాంతం కావడంతో గ్రామాల్లోని రైతులు ఎక్కువ భాగం కంది పంటపై ఆధార పడి ఉంటారు. గతంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నాణ్యమైన ధర అందించారు. సుమారు రూ.10 వేల వరకు క్వింటా ధర పలికింది. నేడు రూ.6 వేలకు కూడా అడిగే నాథుడు కరువయ్యాడు. దళారుల వ్యవస్థతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దొనకొండ ప్రాంతంలో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వెంకట సుబ్బయ్య కోరారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వెంకట సుబ్బయ్య విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షపాతి అని, ప్రజల కష్ట సుఖాలు ఆయనకు తెలుసని, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటే రాష్ట్రం కూడా ఇబ్బంది ఎదుర్కొంటారని, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ పరిపాలన ఉన్నప్పుడు రైతులకు, బడుగు బలహీన వర్గాలకు ఇబ్బందులు లేకుండా చేశారని వెంకట సుబ్బయ్య గుర్తు చేశారు.

సాయం కోసం ఫార్మర్ రిజిస్ట్రీ అవసరం


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రసాద్‌రావు

తాళ్లూరు: ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకున్న రైతులకు 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య యూనిట్ ఐడీ నంబర్ ఇస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు తెలిపారు. శుక్రవారం తాళ్లూరు-1 రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించడంతో పాటు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, ఇప్పటి వరకు 1071 మంది నమోదు చేసుకున్నారని, మిగిలిన వారంతా సత్వరమే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. 2025-26 సంవత్సరానికి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, వడ్డీ లేని పంట రుణాలు, ఇన్పుట్ సబ్సిడీ, సూక్ష్మ, సేద్య పరికరాలు, ఇతర రాయితీ పథకాలు పారదర్శకంగా అందించేందుకు కేంద్రం నుంచి వ్యవసాయ అనుబంధ రంగాలకు కేటాయించిన నిధులు రాబట్టుకునేందుకు, పథకాలు సన్న, చిన్న కారు రైతులకు మరింత చేరువ చేసేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. వీఏఏ నాగరాజు నాయక్, రైతులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి


చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్

ముండ్లమూరు (కురిచేడు): గ్రామంలోని చెత్త నుంచి సంపదను సృష్టించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీఓ ఆర్.జనార్దన్ సూచించారు. మండలంలోని పెద్ద ఉల్లగల్లులో నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు గ్రామంలోని ఇళ్ల వద్ద సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రానికి తీసుకొచ్చి వర్మీకంపోస్టు ఎరువుగా తయారు చేసి విక్రయించి అమ్మగా వచ్చిన ఆదాయాన్ని గ్రామ పంచాయతీ అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచి జనమాల నాగేంద్రం, పంచాయతీ కార్యదర్శి రాజరాజేశ్వరి, జనమాల పిచ్చయ్య, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిన్నెర శాంతి చిన్నదోర్నాలలో జరుగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమంలో ఉండగా డిప్యూటీ తహసీల్దార్ సాలమ్మ సైతం చిన్న గుడిపాడులో జరుగుతున్న భూముల రీసర్వే కార్యక్రమంలో పాల్గొన్నట్లు సిబ్బంది తెలిపారు. దీంతో పాటు పలువురు వీఆర్వోలు సైతం రీ సర్వేలో ఉన్నట్లు చెప్పారు. ఆయన తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కార్యాలయంలో ఆర్ఐ ప్రసాద్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

దొనకొండ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాల్లో గౌతమి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని, కళాశాల అడ్మిన్ నానీ తెలిపారు. బీకాం కంప్యూటర్ విభాగంలో 700 మార్కులకు కళాశాల ప్రథమ స్థానంలో పి.సుబ్బయ్య 567, రెండో స్థానంలో సీహెచ్ సీమోన్ 546, మూడో స్థానంలో ఎస్.కాంతాకుమారి 543 మార్కులు సాధించారు. బీఏ విభాగంలో 600 మార్కులకు షేక్ నాజ్ 509 ప్రథమ, ఎం.సానియామీర్జా 464 ద్వితీయ, ఎన్.సువర్ణ 432 తృతీయ మార్కులు సాధించారు. గౌతమి విద్యా సంస్థల చైర్మన్ కె.గుండారెడ్డి, సీఈఓ నాగేంద్ర బాబు, ప్రిన్సిపాల్ రామయోగి, అధ్యాపకులు వారిని అభినందించారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం


కోలాటం ప్రదర్శిస్తున్న యువకులు

పెద్దారవీడు: మండలంలోని మద్దలకట్ట శ్రీ నాగులమీరాస్వామి ఉరుసు మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దర్గాను సుందరంగా విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. నాగులమీరాస్వామికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి కాయకర్పూరం సమర్పించారు. సాయంత్రం మాస్టర్ రామావత్ మంత్రూనాయక్ ఆధ్వర్యంలో భక్తి పాటలతో భారత కోలాటం యువకులు ప్రదర్శించారు. రాత్రికి భక్తుల కాలక్షేపానికి దాతల సాయంతో భక్త చింతామణి పూర్తి నాటకం ప్రదర్శించారు. శనివారం ఉదయం 6 గంటలకు జెండాల ఉత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించాలి


మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస్

యర్రగొండపాలెం: జరగబోయే రాష్ట్ర బడ్జెట్‌లో పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవెండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1995లో శంకుస్థాపనకు నోచుకున్న ప్రాజెక్ట్ నిర్మాణం నిధుల కొరతతో నత్తనడకన సాగుతూ వచ్చిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆ ప్రాజెక్ట్ పట్ల చిత్తశుద్ధి చూపడం లేదని, ఫలితంగా జిల్లాలోని పశ్చిమ ప్రాంతం పూర్తిగా కరువు కోరల్లో కూరుకొని పోయిందన్నారు. ఇటీవల రాష్ట్ర పార్టీ కార్యదర్శి రామకృష్ణ నాయకత్వంలో జిల్లా బృందం రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసి ప్రాజెక్ట్ పనుల గురించి చర్చించిందని, మంత్రి ప్రాజెక్ట్ పనులను పరిశీలించారేగానీ నిధులు మంజూరు చేయడంలో ఎటువంటి పురోగతి లేదన్నారు. ఈ నెల 28వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బడ్జెట్ ప్రవేశ పెట్టిందని, ప్రభుత్వానికి వెలిగొండ ప్రాజెక్ట్ ఆవశ్యకతను తెలియజేసేందుకు ఒత్తిడి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ మేరకు ఈ నెల 17వ తేదీన మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నామన్నారు. ప్రాజెక్ట్‌కు నిధులు రాబట్టుకునేందుకు చేస్తున్న ఈ ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కేవీ కృష్ణగౌడ్, బాణాల రామయ్య, నక్కా తిరుపతయ్య, వై.వెంకటశివయ్య, మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సర్వే పక్కాగా జరగాలి


రీసర్వేను పరిశీలిస్తున్న ఎస్‌డీసీ జాన్సన్

ముండ్లమూరు (కురిచేడు): రిసర్వేను పక్కాగా చేయాలని ఒంగోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్సన్ ఆదేశించారు. మండలంలోని వేంపాడులో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆట్లాడుతూ రీ సర్వేలో భూముల వివరాలు కచ్చితంగా నమోదు చేయాలన్నారు. వివాదాస్పదంగా ఉన్న వాటిని విచారించి తేడాలు లేకుండా నిర్ధారించి నమోదు చేయాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన రీ సర్వే వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, సర్వేయర్ సీహెచ్ కోటమరాజు, వీఆర్వో ఎం.పెద్దన్న, గ్రామ సర్వేయర్ కళ్యాణ్ పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పెద్దారవీడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సర్వసభ్య సమావేశం ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య అధ్యక్షతన ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జాన్‌సుందరం శుక్రవారం తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు తమ శాఖల రికార్డులు, సమాచారంతో హాజరు కావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు క్లస్టర్ సమావేశాలు

పుల్లలచెరువు: మండలంలోని మూడు జెడ్పీ పాఠశాలల్లో శనివారం క్లస్టర్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ఇందిర తెలిపారు. ఆమె శుక్రవారం మాట్లాడుతూ నూతన విధానం ప్రకారం మూడు పాఠశాలల్లో క్లస్టర్ సమావేశాలు నిర్వహించనున్నట్లు పుల్లలచెరువు, మర్రివేముల, పీవీ పల్లి జెడ్పీ పాఠశాలల్లో సమావేశాలు నిర్వహిస్తారన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలలో హాజరు కావాలన్నారు. శనివారం ఉదయం పాఠశాలలో విద్యార్థులకు భోజనం అందజేసి మధ్యాహ్న సమయంలో సమావేశాలకు హాజరు కావాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తప్పని సరిగా హాజరు కావాలని ఎంఈవో ఇందిర కోరారు.

భగవద్గీత బహూకరణ

దర్శి (కురిచేడు): ప్రపంచ పుస్తక బహూకరణ దినోత్సవం సందర్భంగా విద్యుత్ ఈఈ పి.శ్రీనివాసులుకు భగవద్గీతను మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్, ఐఆర్‌సీఎస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కపురం శ్రీనివాసరెడ్డి శుక్రవారం బహూకరించారు. మానవాళికి ఎప్పటికి నిత్య మార్గదర్శకమైన భగవద్గీత పవిత్ర గ్రంథాన్ని అందజేయడం పుస్తక బహూకరణ దినోత్సవానికి అర్థం తెస్తుందని ఆయన తెలిపారు.

నేడు వీరాంజనేయస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం

పెద్దదోర్నాల: మండల పరిధిలోని శ్రీశైలం రహదారిలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం ట్రస్ట్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలానికి చెందిన భక్తులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సభ్యులు కోరారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి


సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి, డీటీ


అంబేడ్కర్, సంజీవయ్యలకు నివాళులర్పిస్తున్న నాయకులు

దర్శి (కురిచేడు): దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డిలు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. ఆంధ్రప్రదేశ్ 2వ ముఖ్యమంత్రిగా, రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రిగా, రెండు సార్లు ఏఐసీసీ అధ్యక్షునిగా, సంయుక్త మద్రాసు, ఆంధ్ర రాష్ట్రాల్లో అనేక సార్లు మంత్రిగా, కేంద్రం మంత్రిగా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. 38 ఏళ్ల చిన్న వయసులోనే ముఖ్యమంత్రి అయిన ఘనత ఈయనకే దక్కుతుందని ఐఆర్‌సీఎస్ ఎగ్జిక్యూటివ్ మెంబరు కపురం శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నిన్యూ అలియాస్ ఫౌండేషన్ చైర్మన్ కొడవటికంటి ప్రశాంత్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బహుజన కవి అట్లూరి రామారావు, ఏపీజీ బ్యాంకు బొద్దికూరపాడు బ్రాంచి మేనేజర్ నారాయణ, తాళ్లూరు ఎంపీపీ ఎం.దేవరాజు, జి.వెంకటేశ్వర్లు తొలుత అంబేడ్కర్ విగ్రహానికి, దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అట్లూరి రామారావు మాట్లాడుతూ పొట్ట కూటికై మట్టి ఎత్తుకునే జాతి నుంచి ఆంధ్రప్రదేశ్ దళిత ముఖ్యమంత్రిగా ఎదిగిన సంజీవయ్య యావత్తు భారత దేశానికి, రాజకీయ పదవులకు వన్నె తెచ్చారని పేర్కొన్నారు. వెలుగు సీసీ పాలెపోగు గురవయ్య మాట్లాడుతూ కులాలకు అతీతంగా హుందాతనంగా 70 ఏళ్ల క్రితమే విద్య నేర్పే గురువులకు పింఛన్ మంజూరు చేశారని, దళితులకు 6 లక్షల ఎకరాల భూమిని తన పాలనలో పంపిణీ చేశారని కొనియాడారు. బహుజన ఉద్యోగ సంఘ నాయకులు కొడవటి కోటేశ్వరరావు, దర్శి వెలుగు సీసీ ఫణిబాబు, కురిచేడు సీసీ మోహన్‌రావు, ఆంథోని పాల్గొన్నారు.

విత్తన నమూనాలు నాణ్యంగా ఉండాలి

- వ్యవసాయ శాఖ ఏడీఏ బాలాజీనాయక్


శనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

ముండ్లమూరు (కురిచేడు): విత్తన నమూనాలు నాణ్యంగా ఉండేలా చూసుకోవాలని వ్యవసాయ శాఖ దర్శి సహాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ తెలిపారు. మండలంలోని కెల్లంపల్లిలో సాగు చేసిన శనగ పంటను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన నమూనాలను సర్టిఫైడ్ ఏజెన్సీ పరీక్షించినప్పుడు నాణ్యత ప్రమాణాల ప్రకారం ఉంటే ఎఫ్‌పీఓ మద్దతు ధరకన్నా ఎక్కువకు కొనుగోలు చేసి వారికి సర్టిఫికెట్ ఇస్తారని తెలిపారు. శనగలో ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయాధికారి మహ్మద్ ఫారూఖ్ తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు గిరిబాబు, రైతులు పాల్గొన్నారు.

మిట్టపాలెం వీఆర్వో అదృశ్యం

త్రిపురాంతకం: మండలంలోని మిట్టపాలెం వీఆర్వో పాలుట్ల నాగరాజు కనిపించకుండా పోయాడని ఆయన భార్య శైలజ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఉదయం ఇంట్లో సెల్ పెట్టి మోటారు బైక్‌పై బయటకు వెళ్లాడని, ఆయన బైక్ యర్రగొండపాలెం రోడ్డులో సాగర్ కాలువ వద్ద ఉన్నట్లు గుర్తించామని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతను పరామర్శించిన మాజీ మంత్రి సురేష్


భాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి సురేష్

త్రిపురాంతకం: మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుకూరి భాస్కర్‌రెడ్డిని శుక్రవారం పరామర్శించారు. భాస్కర్‌రెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి త్రిపురాంతకంలోని ఆయన గృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు.